క్లుప్తంగా

టెండర్లకు ఆహ్వానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామ పంచాయతీలో 2023–24 సంవత్సరానికి గానూ పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్, నీటి సరఫరా మెటీరియల్ స్టేషనరీ, ఉత్సవాలకు ట్రాక్టర్లు, డోజర్, జేసీబీ, ప్రొక్లెయిన్ (రెంట్) సరఫరా చేసేందుకు ఈ నెల 18న టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 వరకు టెండర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాల కోసం గ్రామ పంచాయతీ, భద్రాచలం కార్యాలయం వద్ద లేదా ఫోన్ నంబర్లు 9642324789, 8639981478లను సంప్రదించాలని సూచించారు.

చేరికలు ఉండవు..

అశ్వాపురం: పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన పాయం వెంకటేశ్వర్లుకు ఎన్నికల్లో వెన్నుపోటు పొడిచిన బీఆర్ఎస్ నాయకులేవరినీ కాంగ్రెస్‌లో చేర్చుకునేది లేదని, కార్యకర్తలు పుకార్లను నమ్మి అధైర్యపడొద్దని నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొండబత్తుల ఉపేందర్ తదితరులు వెల్లడించారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులు బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మనకొద్దు ఆ నాయకులు అంటూ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కాదన్నవారు, పాయం మాయం అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన నాయకులు.. ఏ మొహం పెట్టుకొని పార్టీలోకి వస్తారని ప్రశ్నించారు. సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

అశ్వారావుపేటరూరల్: ఎదురెదురుగా వచ్చిన రెండు లారీలు ఢీకొన్న ఘటన బుధవారం జరగ్గా, ఓ డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. స్థానిక వ్యవసాయ కళాశాల సమీపంలో కర్నాటక రాష్ట్రం బీదర్ జిల్లా బసవ కల్యాణం మండలానికి చెందిన సలీమ్ పాషా పంచదార లోడుతో ఒరిస్సా వైపునకు, భువనగిరి జిల్లా వైపు వెళ్తున్న మరో లారీ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సలీం పాషాకు తీవ్ర గాయాలై కాలు విరిగిపోయింది. బాధితుడి ఫిర్యాదుతో మరో లారీ డ్రైవర్ మేకల వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓటర్లకు కృతజ్ఞతలు

గుండాల: పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యేగా పాయం వెంకటేశ్వర్లు గెలుపుపై ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి వెంకన్న, పాయం నర్సింహరావులు మాట్లాడుతూ..సీపీఐ, టీడీపీ, టీజేఎస్ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి అయిన పాయం వెంకటేశ్వర్లును అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే జరుగుతుందని అన్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నేడు ప్రమాణ స్వీకారం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సతీష్, జనార్దన్, ప్రభాకర్, రఘుపతి, చిరంజీవి, శ్రీను, పర్వీన్, సునిత, నాగేశ్వరావు, నరేష్, లాలు, సంతోష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



డ్రెయినేజీ వెంబడి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మిస్తుండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ స్తంభం ఎప్పుడు నేలకొరుగుతుందో అన్నట్లు ఉంది. డ్రెయినేజీ వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాన్ని పక్కకు మార్చాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా అక్కడే ఉంచాడు. ప్రస్తుతం తుపాన్ ప్రభావంతో స్తంభం చుట్టూ ఉన్న కాస్త మట్టి కూడా కొట్టుకుపోయింది. దీంతో అది ఎప్పుడు కూలి ఏ ప్రమాదం తెచ్చిపెడుతుందో అని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆగని వాన.. తీరని నష్టం

మిచాంగ్ తుపాన్ ప్రభావం చూపుతూనే ఉంది. బుధవారం కూడా వర్షం, ఈదురు గాలులు కొనసాగాయి. వర్షాల ధాటికి పంటపొలాలు నీటి పాలయ్యాయి. కోతకొచ్చిన వరిపొలాలు, చేతికొచ్చిన పత్తి, మిరప, వేరుశనగ పంటలు ధ్వంసమయ్యాయి. మరోవైపు ఇప్పటికే కల్లాలకు చేరిన ధాన్యం తడిసిపోయింది. ఇక వరదతో పలుచోట్ల చెరువులు, వాగులు, చెక్‌డ్యాంలు, లోలెవల్ చెప్టాలు పొంగి పొర్లాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పాడింది. వీధుల్లోనూ వరద నీరు పోటెత్తింది. పశువుల మేతకు, జనజీవనానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి.

– సాక్షి నెట్‌వర్క్



ములకలపల్లి: మత్తడిపోస్తున్న మూకమామిడి ప్రాజెక్ట్



అన్నపురెడ్డిపల్లి: వాగును తలపిస్తున్న అబ్బుగూడెం-కట్టుగూడెం రహదారి..



అశ్వారావుపేటరూరల్: వినాయకపురంలో కాలువకు గండి, పడిపోయిన విద్యుత్ స్తంభం



దుమ్ముగూడెం: నేలకొరిగిన మొక్కజొన్న పంట



ములకలపల్లి: తిమ్మంపేటలో నీటమునిగిన నాటు పొగాకు



దమ్మపేట: గండిపడిన పేరంటాల చెరువు



అన్నపురెడ్డిపల్లి: వరి పంటలో చేరిన వర్షపు నీరు



అన్నపురెడ్డిపల్లి: అలుగుపోస్తున్న రాళ్లవాగు చెరువు



ములకలపల్లిలోని ఓ వీధిలో వరద నీరు..



దమ్మపేట: తాటి చెట్టు పడి ధ్వంసమైన ఇల్లు



దుమ్ముగూడెం: సున్నంబట్టి-బైరాగులపాడు రహదారిపైకి చేరిన వర్షపు నీరు



మణుగూరుటౌన్: రామానుజవరం వద్ద రోడ్డుపై పడ్డ చెట్టును తొలగిస్తున్న సర్పంచ్



అశ్వారావుపేటరూరల్: ఊట్లపల్లిలో దెబ్బతిన్న ఇంటి పునాది



చంద్రుగొండ: బెండాలపాడులో వర్షపునీటిలో ఉన్న పంటను చూపుతున్న రైతులు



అశ్వారావుపేటరూరల్: దబ్బతోగు వద్ద కొట్టుకుపోయిన వేరుశనగ పనలు



అశ్వారావుపేటరూరల్: గుర్రాలచెరువు గ్రామంలో నేలమట్టమైన కాకర తోట



అశ్వాపురం: గొందిగూడెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఇసుకవాగు



అశ్వాపురం: అమెర్దలో నీట మునిగిన మిర్చి పంట



మణుగూరుటౌన్: మల్లంపాడు ఏరియాలో నీట మునిగిన పంటపొలాలు



చర్ల: గొమ్ముగూడెంలో చెరువును తలపిస్తున్న మిర్చి చేను



అశ్వారావుపేటరూరల్: అచ్యుతాపురంలో నర్సింహాసాగర్ చెరువు కాలువకు గండి..



కరకగూడెంలో ధాన్యపు రాశులు తడవకుండా కప్పిన పట్టాలు



అశ్వారావుపేటరూరల్: తడిసిన ధాన్యం కుప్పను పరిశీలిస్తున్న ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి

పంటలను పరిశీలించిన అధికారులు



మణుగూరురూరల్: నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ మంగీలాల్

మణుగూరురూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని తోగ్గూడెం తదితర గ్రామాల్లో నేలకొరిగిన, దెబ్బతిన్న వరి పంటలను ఆర్‌డీఓ మంగీలాల్ వ్యవసాయ అధికారులతో కలిసి బుధవారం సందర్శించి పరిశీలించారు. పంట వివరాలను సేకరించి నివేదికలు పంపించాలని సూచించారు. మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఏఈఓ వీరేంద్రనాథ్ నాయుడు, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ములకలపల్లి: మండల పరిధిలోని కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు నీట మునుగుతున్నాయి. వరి పొలాలు నీటమునుగుతుండగా.. మొక్కజొన్న చేలు నేలవాలాయి. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎంఏఓ కరుణామయి, ఏఈఓలు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, వివరాలను సేకరిస్తున్నారు.

బూర్గంపాడు: మండలంలో నీటమునిగిన పంటచేలను మండల వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. బూర్గంపాడు, సంజీవరెడ్డి పాలెం గ్రామాలలో నీటమునిగిన వరి, పత్తి, మిరప పంటలను వారు పరిశీలించి పంట నష్టాలను నమోదు చేశారు. అయా కార్యక్రమాలలో మండల వ్యవసాయశాఖ అధికారి అనిల్, ఏఈఓ ప్రసాద్, మారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

దుమ్ముగూడెం: తుఫాన్ ప్రభావంతో భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.50వేలు చెల్లించాలని భద్రాచలం సీపీఎం నియోజకవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో భద్రాచలం నియోజకవర్గం వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రాచలం నియోజకవర్గంలో వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం మండల రైతుల పరిస్థితిని ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు.

గుండాల: గత మూడు రోజులుగా వస్తున్న తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని న్యూడెమొక్రసీ, ప్రజాపంథా నాయకులు పర్శిక రవి, యాసారపు వెంకన్న, శంకర్, మంగయ్యలు డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులతో సర్వేలు నిర్వహించాలని, వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

చర్ల: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ డిమాండ్ చేశారు. చర్ల మండలంలో కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న వరి, మిర్చి, పత్తి పంటలను ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నష్టపోయిన రైతాంగానికి మిర్చికి ఎకరాలకు రూ.50 వేలు, వరికి ఎకరాకు రూ.25 వేలు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వారిలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు కనితి భానుప్రకాశ్, పీవైఎల్ మండల నాయకులు చిరిగిడి నరేష్, రమేష్, రాజు, ప్రతాప్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మిచాంగ్ తుపాన్ ప్రభావంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రామానుజవరం సర్పంచ్ బాడిశ సతీష్ విజ్ఞప్తి చేశారు. రామానుజవరం పంచాయతీలో చేతికి వచ్చిన పంట నేలకొరగగా.. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యిందని అన్నారు. వరితో పాటు మిరప, పత్తి, చిరుధాన్యాలు, ఆకుకూరల పంటలు సైతం తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించిన పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆయన కోరారు. అలాగే వర్షాలకు కొండాయిగూడెం, తిర్లాపురం పంచాయితీలకు వెళ్లే రహదారిలో వృక్షం నేలకొరిగి రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఉండడంతో వెంటనే ఆయన పంచాయితీ సిబ్బందితో వృక్షాన్ని తొలగించారు. కార్యక్రమంలో బాడిశ నాగేష్, మామిడిపల్లి శ్రీను, సాధిని శంకర్, దొంతసారపు గంగాధర్, కేతినేని రాజేష్, గంటా హరిబాబు, పంచాయితీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా పాలన

మణుగూరుటౌన్: అన్ని వర్గాలకు న్యాయం చేయగలిగే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఐఎన్‌టీయూసీ ఓబీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు అన్నారు. బుధవారం పినపాక నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ మహాలక్ష్మి ఓబీ కంపెనీలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి ప్రజలు తమ విశ్వసనీయతను చాటుకున్నారన్నారు. పినపాక నియోజకవర్గాన్ని గతంలో అభివృద్ధి చేసిన పాయం వెంకటేశ్వర్లును మళ్లీ గెలిపించిన ప్రజలకు, కష్టపడ్డ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నాయకులు బాపనపల్లి మహేశ్, నగేశ్ నాయుడు, తమ్మిశెట్టి ఉప్పయ్య, ఎలిశాల ప్రవీణ్, మరళీ, సంపత్‌రాజు, కుమారస్వామి, సంపత్‌కుమార్, సాంబ, ఫిట్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి

గుండాల: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని ఆళ్లపల్లి ఎంపీడీఓ బత్తిని శ్రీనివాస రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు వస్తున్న క్రమంలో కార్యదర్శులు అందుబాటులో ఉండాలని తెలిపారు. చేను పనులకు, పశువులను మేతకు తీసుకెళ్లేవారు వాగులు దాటి వెళ్లవద్దని సూచించారు. వాగులు తగ్గుముఖం పట్టాకే వెళ్లాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి రేవంత్ అన్నారు. మంచినీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలని ఈ సదర్భంగా సూచనలు తెలిపారు. మరోవైపు గర్భిణుల కోసం చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. అందులో భాగంగా అత్యవసర సమయం వరకు వేచి చూడకుండా ముందస్తుగా వారిని ఆస్పత్రికి తరలించాలని సూచించారు.

‘ఉపా’ చట్టాన్ని రద్దు చేయాలి

భద్రాచలంటౌన్: దేశంలో ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్న వారిపై ప్రయోగించే ఉపా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ డివిజన్ నాయకుడు ముసలి సతీష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడు జీవించే హక్కుతో పాటు భావ ప్రకటన స్వేచ్ఛను కలిగి ఉంటారని, పాలకుల తప్పిదాలను బయటపెట్టే ప్రశ్నించే గొంతుకను నొక్కడానికే పాలక ప్రభుత్వాలు ఇటువంటి చట్టాలను తీసుకొస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణాలో త్వరలో అధికారం చేపట్టే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలకు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం పలు ప్రాంతాల్లో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వక్తలు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు అంబేడ్కర్ అని.. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వాపురం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దళిత, గిరిజన నాయకులు



భద్రాచలంఅర్బన్: పూలమాల వేస్తున్న మొబైల్ కోర్ట్ మెజిస్ట్రేట్ శివాజీ, సిబ్బంది



చర్ల: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు



అన్నపురెడ్డిపల్లి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్సై షాహీనా



మణుగూరురూరల్: పూలమాల వేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు